మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



ఇంటి యజమానులతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## ఇల్లు అంటే ఇటుకలు కట్టడం కాదు
# పేదల ఆత్మగౌరవం

- డబల్ బెడ్ రూమ్ పేరుతో ఓట్లు దండుకున్నారు
- సొంతింటి కల సాకారం చేసింది కాంగ్రెస్సే
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

3



పాద ముద్రలను పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

# వెయ్యేండ్ల నాటి పాదాలు

- శివలింగాలను కాపాడుకోవాలి
- పురావస్తు పరిశోధకులు డా.ఈమని శివనాగిరెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 2 ప్రభాతవార్త:** అచ్చంపేట మండలం కొండనాగుల గ్రామ శివారులో ఉన్న శివాలయం ముందున్న బండపై చెక్కిన పాదాలు, శివలింగాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకులు ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈవో డా.ఈమని శివనాగిరెడ్డి అన్నారు. స్థానిక గంగాగౌరీ రామలింగేశ్వరాలయ కమిటీ అధ్యక్షులు అంబటి లింగమయ్య ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం ఆయన శివాలయం ముందు బండపై పాదాలు, 6 చిన్న శివలింగాలు చెక్కి ఉన్నాయన్నారు. 53 సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం ఉన్న పాదముద్రలు, శివలింగాలు కళ్యాణీ చాళుక్యుల (సా.శ. 11వ శతాబ్దం) కాలం నాటివి అన్నారు. చారిత్రక నేపథ్యానికి సంబంధించిన జ్ఞానం, చరిత్రపై అవగాహన లేని క్వారీ పని వాళ్ల వల్ల ఆ చారిత్రక గుర్తులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్థానిక నాయకత్వం ఎన్నో దశాబ్దాల చారిత్రక ప్రాధాన్యత గల ఈ శిల్పాలను కాపాడి భావి తరాలకు అందించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఆయనతో పాటు కాట్రాజు తిరుపతయ్య, అంబటి నరసింహ, నిమ్మల రాజు, తెలుగు ఎల్లయ్య, శిల్పి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం



ఎస్పీ డా.వినీత్

**నారాయణ పేట, నవంబరు 2 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో ప్రజల సమస్యలను తెలుసుకోవడం మరియు పరిష్కరించడంలో భాగంగా నేడు సోమవారం 3వ తేదీ జిల్లా ఎస్పీ డా.వినీత్ డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం నిర్వహించనున్నారని పోలీసులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలు ఫిర్యాదులు లేదా సూచనలను తెలియజేయాలనుకుంటే ఎస్పీ కార్యాలయ నంబర్ 0850 6281182 కు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు కాల్ చేయవచ్చని ఎసీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా ప్రజలతో మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించి తక్షణ పరిష్కార మార్గాలను సూచిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## శ్రీ కురుమూర్తి కొండకు
# పోటెత్తిన భక్తజనం

- శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్
- జాతర రహదారులు భక్తులతో కిటికిట

**చిన్న చింతకుంట, నవంబరు 2 ప్రభాతవార్త :** తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడి ప్రతిరూపంగా కొలువబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం కురుమూర్తి కొండకు పల్లె ప్రాంతాల నుంచి కాకుండా పట్టణ ప్రాంతాల నుంచి భక్తుల రాకతో కిక్కిరిసిపోయింది. ఆదివారం సెలవు కావడంతో పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు పలు వాహనాలలో తరలివచ్చి స్వామివారికి పచ్చిపులుసు, పరమాన్నంతో స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. కొండ దిగువ నుంచి స్వామివారికి సన్నిధి వరకు క్యూలైన్లు భక్తులతో నిండిపోయింది.



కొండపై క్యూలైన్లలో నిలుచున్న భక్తులు

భక్తులు గంటల తరబడి క్యూలైన్ల లో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. కొండ దిగువన జాతర రహదారులు భక్తులతో కీటకటిలాడాయి. జాతర మైదానంలోని దుకాణ సముదాయాలు యాత్రికల కొనుగోళ్లతో సందడిగా మారాయి. పల్లె ప్రాంత భక్తులు తమ కుటుంబ సభ్యులతో దుకాణ సముదాయాల వద్ద కొనుగోలు చేశారు. రంగులరాట్నాల వద్ద చిన్నారులు సంతోషంగా గడిపారు. శ్రీ కురుమూర్తి స్వామిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. కొండపై గల ముఖ ద్వారం వద్దకు జిల్లా కలెక్టర్ దంపతులు చేరుకోగానే మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ దంపతులకు శాలువతో సత్కరించి ఆలయ విశిష్టతను వివరించారు. అనంతరం ఆశీర్వచనాలు అందించారు. ఆయన వెంట దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి పాలకమండలి సభ్యులు ఉన్నారు.



శ్రీ కురుమూర్తి స్వామి సన్నిధిలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దంపతులు



జాతర ప్రాంగణంలో పోటెత్తిన భక్తజనం

## నేడు నల్లమలకు
# సీఎం రేవంత్ రెడ్డి

- ఎస్ఎల్‌బిసి టన్నెల్ సందర్శన
- అచ్చంపేట నాయకులతో సమావేశం



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 2 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోమవారం నల్లమలలో పర్యటించనున్నారు. నాగర్ కర్నూలు జిల్లాలోని మన్నేవారిపల్లి వద్ద ఎస్ఎల్‌బిసి టన్నెల్ సందర్శన, అనంతరం అచ్చంపేట నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు నేటి మధ్యాహ్నం 12:30 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి హెలికాప్టర్ ద్వారా బయలుదేరనున్నారు.

**సీఎం షెడ్యూల్**

- మధ్యాహ్నం 12:30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరుతారు
- 1:10 గంటలకు ఎస్ఎల్బీసీ టన్నెల్‌కు చేరుకుంటారు
- 1:15నుంచి 1:25గంటల వరకు అచ్చంపేట నాయకులతో సమావేశం
- మధ్యాహ్నం 2గంటలకు ఎలక్ట్రో మాగ్నెటిక్ లూప్ సందర్శన
- 2:10గంటలు తిరిగి హెలికాప్టర్ ద్వారా బేగంపేటకు బయలుదేరుతారు.



ఫారెస్ట్ అధికారి సువర్ణ కు ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాస్ గౌడ్

# రూ.కోటి విలువైన కలప ధ్వంసం

- గోపాల్ దిన్నె రిజర్వాయర్ దగ్గర కలప ధ్వంసం
- అందులో నివసిస్తున్న వన్యప్రాణులకు హాని
- సెక్రటేరియట్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి సువర్ణకు ఫిర్యాదు

**వనపర్తి, నవంబరు 2 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలోని కల్వరాల శివారులో గల గోపాలదిన్నె రిజర్వాయర్ సమీపంలో 20 ఎకరాలకు పైగా ఏపుగా పెరిగిన కలపను ధ్వంసం చేసి సొమ్ము చేసుకున్నారు. 50 సంవత్సరాలుగా పెరుగిన ఈ కలపలో వన్యప్రాణులను నివసిం చేవని ఇక్కడ జింకలు, నెమళ్లు, అడవి పందులు, కుందేళ్లు, తదితర వన్యప్రాణులు నివసించేవని, వన్యప్రానులకు హాని కలిగించారంటూ సెక్రటేరియట్ నుండి వచ్చిన ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారిని సువర్ణకు శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు చేశారు. ఆమె ప్రభుత్వ పనిలో భాగంగా ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రానికి వివిధ అభి వృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ మేరకు ఆమె మాట్లాడు తూ జంతువులకు ఎలాంటి హాని కలిగించకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిబ్బందికి తెలియజేశారు. ఫారెస్ట్‌ను కూడా రక్షించాల్సిన బాధ్యత మనందరిదని తెలిపారు. వన్యప్రాణు లకు ఇబ్బందులు కలిగితే చర్యలు తీసుకోవాలని ఆమె ఈ సంద ర్భంగా తన సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఫారెస్ట్‌లో పెరిగిన ఈ కలపను ప్రభుత్వ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఎపుగా పెరిగిన కలపను ధ్వంసం చేయడం జరిగిందని శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదులో పేర్కొ న్నారు. బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకొని నివేదిక సమర్పించా లంటూ వనపర్తి రేంజ్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

# బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తప్పవు

- అమ్మాయిలు 18 సంవత్సరాలు పూర్తి అయ్యే వరకు ఖచ్చితంగా చదివించాలి
- వయస్సు నిండకుండా పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరం
- 2 సంవత్సరాల జైలు శిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, నవంబరు 2 ప్రభాతవార్త:** బాల్య వివాహాలు చేస్తే అందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరి పై చట్టరీత్య కేసులు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలిపారు. అమ్మాయిలు 18 సంవత్సరాల వయస్సు పూర్తి అయ్యే వరకు వారిని ఖచ్చితంగా చదివించాలని, చదువులు పూర్తి అయ్యక తనంతట తాను నిర్ణయాలు తీసుకొనే దశకు వచ్చినపుడు సంతోషంగా వివాహం జరిపించుకోవచ్చని అలాకాకుండ 18 సంవత్సరాలలోపే పెళ్ళి చేస్తే అందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారంగా అమ్మాయిలకు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాల వయస్సు నిండకుండా పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరం అవుతుందన్నారు. ఈ చట్టం ప్రకారం బాల్య వివాహానికి అనుమతినిచ్చినా, ప్రోత్సహించిన, వివాహాన్ని నిర్వహించినా, బాల్య వివాహానికి హాజరైన వారందరినీ నిందితులు గానే పరిగణింపబడతారు. ఇట్టి నేరానికి బాల్యవివాహ నిషేధ చట్టం 2006 సెక్షన్స్ 9,10,11(1) 13(10) ప్రకారం గరిష్టంగా" 2 సంవత్సరాల "జైలు శిక్ష లేదా లక్ష రూపాయల వరకు జరిమానా" లేదా రెండు విధించబడతాయి. ఇది "నాన్ బెయిలబుల్ నేరమనీ తెలియజేశారు. బాల్య వివాహాలను అరికట్టడానికి చట్టం ప్రకారం గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ జిల్లాస్థాయిలో



జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి (ఫైల్)

జిల్లా కలెక్టర్, డివిజనల్ స్థాయిలోఆర్డీవో /సబ్ కలెక్టర్, ప్రాజెక్టు స్థాయిలో సిడిపిఓ,మండల స్థాయిలోతహసిల్దార్,సెక్టార్ స్థాయిలో సూపర్‌వైజర్, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి/వీఆర్వో, బాలల వివాహ నిషేధ అధికారులు (ఛైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ ఆఫీసర్స్) గా వ్యవహరిస్తారని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహం జరిపించడానికి ప్రయత్నం చేసినట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని, అదేవిధంగా చైల్డ్ లైన్ 1098 లేదా 100 పోలీస్‌కు ఫోన్ చేసి తెలియచేయాలని సూచించారు. ఇటీవల ఘనపూర్ మండలం, వెంకటం పల్లి గ్రామంలో బాల్య వివాహాన్ని అడ్డుకొని అమ్మాయి, అబ్బాయి తల్లిదండ్రులపైన, ఫంక్షన్ హాల్ యజమాని పైన, పెళ్ళిచేయడానికి వచ్చిన పూజారి పైన సైతం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, కుల పెద్దలు, పూజారులు ప్రతి ఒక్కరు బాల్య వివాహాలకు మద్దతు ఇవ్వవద్దని, చట్టాన్ని అమలు చేసేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేసి ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## రూ.రెండు కోట్లతో
# మయూరి సుందరీకరణ

- ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డా.సి.సువర్ణ
- మొక్కలు నాటి ఫోటో ఎగ్జిబిషన్ తిలకించి..
- పిల్లలమర్రి సందర్శన

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 2 ప్రభాతవార్త :** నగర్ వన్ యోజన ద్వారా రూ.2 కోట్లతో మయూరి పార్క్ అభివృద్ధి , పునరుద్ధరణ ,సుందరీకరణ పనులు చేపట్టడం జరిగిందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డా.సి.సువర్ణ అన్నారు. ఆదివారం మయూరి పార్క్ లో బోటింగ్ ప్రదేశం వద్ద మొక్కను నాటిన అనంతరం సమావేశ మందిరం వద్ద నగర వన్ కింద సుమారు 70 లక్షల వ్యయంతో పూర్తి చేసిన రూఫ్ టాప్ సోలార్ పవర్ ప్లాంట్, 15 కిలో వాట్, 11 సైకిళ్లు, పిల్లల ఆటల పరికరాలు, టైగర్ ఫోటో పాయింట్ పునరుద్ధరణ, మరమ్మత్తు పనులు, బటర్ ఫ్లై, కరెన్సీ పార్క్ పునరుద్ధరణ, సుందరీకరణ పనులను ఆమె ప్రారంభించారు. నగర వన్ ద్వారా పూర్తి చేసిన, జరుగుతున్న పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆమె తిలకించి పనుల గురించి తెలుసుకున్నారు. అనంతరం –మిగతా3లో..



సుందరీకరణ పనులు ప్రారంభిస్తున్న సువర్ణ





## మర్రి జోష్..
# మూన్నాళ్ల ముచ్చటేనా !

- కేటీఆర్ సభతో అలిసిపోయారా...?
- అచ్చంపేటను మరచిన మర్రి....
- అచ్చంపేట బీఆర్ఎస్‌కు ఆది నాయకత్వం అందించేనా
- అయోమయంలో బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు

**వంగూరు, నవంబర్ 2 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పార్టీ పదవికి రాజీనామా చేసి బిజెపిలో చేరగానే అచ్చంపేట బిఆర్ఎస్ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటానని ఏ ఆపద వచ్చిన నేనున్నానని భరోసా కల్పించిన బిఆర్ఎస్ నాగర్‌క ర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, అచ్చంపే ట నియోజకవర్గంలోని బిఆర్ఎస్ కార్యకర్తలకు, నాయ కులలో నింపిన జోష్ మున్నాళ్ల ముచ్చటేనా అన్న సందేహం మొదలవుతుంది. గువ్వల రాజీనామాతో అచ్చంపేట నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకుల కు కార్యకర్తలకు ఆది నాయకుడు లేకపోవడంతో మర్రి జనార్దన్ రెడ్డిని అచ్చంపేట ఇన్చార్జిగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకత్వం నియమించింది. అయితే మొదట్లో మర్రి జనార్దన్ రెడ్డి అచ్చంపేట నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలతో పాటు అచ్చంపేట నడి బొడ్డున సమావేశాలను ఏర్పాటు చేసి రాష్ట్ర మాజీ మంత్రుల తో సన్నాహాలు నిర్వహించి కార్యకర్తలకు ధైర్యాన్ని నింపారు. దాంతో ఆగకుండా అచ్చంపేట నియోజక వర్గం కేంద్రంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభ నిర్వహించే వరకు అంత బాగానే ఉంది. ఆతర్వాతే అసలు కథ మొదలైంది. అచ్చంపేట నియోజకవర్గంలో ఏదో ఒక మండలంలో ప్రతినిత్యం కార్యకర్తలతో మమేకమై తిరుగుతున్న మర్రి జనార్దన్ రెడ్డి ఒక్కసారిగా నియోజకవర్గానికి దూరం కావడంతో కార్యకర్తలు కంగు తింటున్నారు. స్థానిక ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ సత్తా ఏంటో చూపించి గువ్వల మతి భ్రమించేలా గెలుపొందాలని ధీమాతో ఉన్న నాయకులకు అంతలోనే ఏమైందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నల్లమల ప్రాంతం అతలాకుతలమైన బిఆర్ఎస్ ఇంచార్జ్ మర్రి జనార్దన్ రెడ్డి ఏ ఒక్క ప్రాంతాన్ని సందర్శించకపోవడంతో ఆంతర్యమేమిటని పలువురు చర్చించుకుంటు న్నారు. గువ్వల పార్టీ వీడిన కొత్తలో కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పినా నాయకుడు అచ్చంపేటపై కన్నెత్తి చూడకపోవడంతో ఎన్నో అభ్యంతరాలు మొదల వుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అనుకున్న సమయానికి స్థానిక ఎన్నికలు నిర్వహించి ఉంటే గులాబీ నేతల పరిస్థితి ఏంటో అన్న సందేహాలు లేకపోలేదు. ఆది నాయకుడు లేకపోవడం వల్ల స్థానిక సమరంలో ఎలా ముందుకు వెళ్లాలో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో ఉండేవారని ఆలోచనలు మొదలవు తున్నాయని చెప్పుకోవచ్చు. అచ్చంపేట టిఆర్ఎస్ పార్టీకి పూర్తి ఇన్చార్జిని రాష్ట్ర నాయకత్వం నియమిస్తుందా లేక మర్రితోనే కొనసాగిస్తుందా అన్న అనుమానాలు వ్యక్తం కావడంతో పాటు ఆది నాయకుడు లేకపోవడంతో కార్యకర్తల మనోభావాలు సన్నగిల్లి కాంగ్రెస్, బిజెపి పార్టీలలో చేరేందుకు సిద్ధమవుతున్నారని విశ్వాసనీయ సమాచారం. ఇప్పటికే కొన్ని గ్రామాలలో గువ్వల బాల రాజ్ బిఆర్ఎస్ పార్టీలో ఉన్న సమయంలో తన అను చరులుగా పనిచేసిన నాయకులు తనతో కమిట్మెంటై గువ్వల బాటలో నడిచేందుకు సిద్ధమవుతున్నారని చెప్పుకోవచ్చు. బిఆర్ఎస్ పార్టీలో పనిచేస్తున్న కొందరు నాయకులు తమకు పూర్తిస్థాయిలో ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగిస్తే అచ్చంపేట బిఆర్ఎస్ పార్టీని కార్యకర్తలను కాపాడుకుంటామని చెబుతున్నారు. ఏది ఏమైనా మర్రి పూర్తిస్థాయిలో –మిగతా3లో..

వార్తా కథనానికి స్పందన

## స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు

**విరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు**



నర్వ, నవంబరు 2 ప్రభాతవార్త: నర్వ మండల పరిధిలోని రాయికోడ్ నర్వ ప్రధాన రహదారిలో భూచెరువు దగ్గర రోడ్డు పక్కన ఉన్న సగానికిపైగా విరిగి ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని ఆ శాఖ అధికారులు ఆదివారం తొలగించారు. అక్టోబర్ 31న విరిగిన విద్యుత్ స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం శీర్షికన వార్త దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నర్వ ఏఈ రాజేందర్ గౌడ్ విరిగిన స్తంభం స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయడంతో ప్రజలు,పాదచారులు, వాహనదారులు వార్త పత్రికతో పాటు, సంబంధిత శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బాల రక్ష వాహనానికి డ్రైవర్ పోస్టు దరఖాస్తులు

**నారాయణ పేట, నవంబరు 2 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా పరిధిలోని బాల రక్ష భవనమునకు సంబంధించిన వాహనాన్ని నడిపేందుకు అనుభవం గల అర్హత కలిగిన డ్రైవర్ల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి అదనపు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నియామకానికి పదవ తరగతి విద్యార్హత కలిగి ఉండడం అవసరం. అదనంగా డ్రైవింగ్‌లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. దరఖాస్తుతో జతచేయవలసిన పత్రాలు పదవ తరగతి సర్టిఫికేట్ చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ అనుభవ సర్టిఫికేట్ స్థానికత సర్టిఫికేట్ ఆధార్ కార్డు ప్రతులు అర్హతలు కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు నిర్ణీత దరఖాస్తు ఫారంతో పాటు అవసరమైన పత్రాలను జిల్లా సంక్షేమాధికారి కార్యాలయం మోనప్పగుట్ట దగ్గర, నారాయణపేట వద్ద 07112025 సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయ వేళల్లో సమర్పించవలసిందిగా అధికారులు తెలిపారు .

## ఊట్కూర్ రైల్వే స్టేషన్ సాధనకై సమిష్టి కృషి అవసరం

**ఊట్కూర్, నవంబరు 2 ప్రభాతవార్త :** ఊట్కూర్ రైల్వే స్టేషన్ సాధనకై ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని రైల్వే స్టేషన్ సాధన సమితి అధ్యక్షులు భాస్కర్, ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, విగ్నేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఊట్కూర్‌లో అఖిలపక్ష నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉట్కూర్‌లో రైల్వే స్టేషన్ ఏర్పాటుతో మండలంలోని 27 గ్రామాలు, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని పది గ్రామాలకు రవాణా సౌకర్యం కలుగుతుందని తెలిపారు. మండలం అభివృద్ధి దిశగా ఇది కీలకమైన అడుగు అవుతుందని, ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు వలస వెళ్లిన ఊట్కూర్ ప్రాంత ప్రజలకు ఇది మళ్లీ ఊపిరినిస్తుందని పేర్కొన్నారు. గతంలో విడుదలైన డీపీఆర్‌లో ఉట్కూర్ స్టేషన్ ఉన్నప్పటికీ, కొత్త డీపీఆర్‌లో హాల్ట్‌గా చూపించడం విచారకరమని అన్నారు. రైల్వే స్టేషన్ సాధన కోసం రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రతి గ్రామస్థుడు ఏకమై కృషి చేయాలని కోరారు. అనంతరం రైల్వే స్టేషన్ లోగోను ఆవిష్కరించి, ఏకగ్రీవంగా రైల్వే స్టేషన్ సాధన కమిటీని ఏర్పాటు చేశారు.



రైల్వే స్టేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## నేడు విద్యుత్ వినియోదారుల దినోత్సవం

**నారాయణ పేట, నవంబరు 2 ప్రభాతావార్త:** నారాయణపేట సర్కిల్ కార్యాలయం ఆవరణలో నేడు ఉదయం 11 గంటలకు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్.ఈ వెంకటరమణ తెలిపారు. నారాయణపేట పట్టణం గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సంబంధిత సమస్యలను వ్రాతపూర్వకంగా అధికారులకు అందించాలని ఆయన కోరారు. వ్యవసాయ పంపు సెట్ల కొనుగోలులో నాణ్యమైన ఐఎస్ఐ మార్క్ కలిగిన వస్తువులను మాత్రమే వినియోగించాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, విద్యుత్ వినియోగదారులు తప్పక పాల్గొనాలని ఆయన అభ్యర్థించారు. నారాయణపేటతో పాటు మక్తల్ కోస్గి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో కూడా ఈ దినోత్సవం జరగనున్నట్లు ఎస్ఈ వెంకటరమణ పేర్కొన్నారు.

## రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి

**నారాయణ పేట, నవంబరు 2 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో అధిక వర్షాల కారణంగా పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా తెలిపారు. ప్రభుత్వం ఎకరాకు రూ.30,000 నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు తుపాన్ వల్ల నష్టపోయిన వారికి నష్టపరిహారం ఇచ్చినట్లే, అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సీసీఐ అధికారులు పత్తి తేమ శాతం 20 వరకు ఉన్న పత్తిని కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వర్షాల కారణంగా వరి పంటలు కూడా నష్టపోతున్నాయని రైతులను రక్షించేందుకు వాతావరణ ఆధారిత పంట బీమా సదుపాయం కల్పించాలని అభ్యర్థించారు.




మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త హెచ్.నర్సింహా

## పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలి

**ఉట్కూర్, నవంబరు 2 ప్రభాతవార్త :** తెలంగాణలో అకాల వర్షాల కారణంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్న పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ ఉట్కూర్ మండల ఇంచార్జి కొక్కు గౌతమ్ డిమాండ్ చేశారు. రైతులు కష్టపడి పండించిన పత్తిని క్వింటాలుకు కనీసం పది వేల రూపాయల మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలి అని ఆయన అన్నారు. ఇందిరమ్మ ప్రజాపాలనలో రైతుల గోస పట్టించుకోని ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే పత్తి కొనుగోలు ప్రారంభించి, పంట నష్టాలను అంచనా వేసి పరిహారం చెల్లించాలన్నారు. రైతులు పండించే ప్రతి పంటకు కూడా సరైన మద్దతు ధర కల్పించే విధానాన్ని ప్రభుత్వం అవలంబించాలని కొక్కు గౌతమ్ పేర్కొన్నారు.

## డిప్యూటీ కలెక్టర్ రవితేజకు ఘన సన్మానం

**మక్తల్ టౌన్, నవంబరు 2 ప్రభాతవార్త:** నల్గొండ జిల్లా డిప్యూటీ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన రవితేజ మొదటిసారి మక్తల్ పట్టణానికి వచ్చిన సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ రవితేజను అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ 1లో ఎంపికైన రవితేజ ఆదివారం అమ్మమ్మ ,తాతయ్య రామచంద్రప్ప రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యు ఇంటికి రావడంతో అంబేద్కర్ యువజన సంఘం ఘనంగా సత్కరించారు. డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఫూలే తన స్ఫూర్తిదాయకమని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి బండారి కృష్ణ , కాంగ్రెస్ నాయకులు గోలపల్లి నారాయణ, కోరి మారెప్ప తదితరులు పాల్గొన్నారు.



రవితేజను సన్మానిస్తున్న దృశ్యం

## మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ జాగిలంతో ఆకస్మిక తనిఖీలు:ఎస్పి

**దామరగిద్ద, నవంబరు 2 ప్రభాతవార్త :** ఆదివారం దామరగిద్ద మండల కేంద్రంలో నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్పీ డా. వినీత్ తెలిపారు. దామరగిద్ద పోలీస్ స్టేషన్ పరిధిలో మత్తుపదార్థాలు నిర్మూలించడానికి పకడ్బందీగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా కిరాణా షాపులలో,అనుమానంగా ఉన్న పంట పొలాల్లో,పాన్‌షాప్‌లలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజలు, ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్న లేదా రవాణా చేసిన, సరఫరా చేసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని అని ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ రెడ్యానాయక్, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పరమేశ్,తదితరులు పాల్గొన్నారు.



పోలీసు జాగిలాలతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

# హైదరాబాద్-శ్రీశైలం రహదారిపై రాకపోకలు ప్రారంభం

ఉప్పునుంతల, నవంబరు 2 ప్రభాతవార్త : మొంథాతుఫాన్ ప్రభావంతో ధ్వంసం అయిన జాతీయ రహదారి 765 మరమ్మత్తు పనులు పూర్తయ్యాయి. జాతీయ రహదారి 765 అధికారులు,సదర్ గుత్తే దారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో దెబ్బతిన్న రహదారి పనులను వేగంగా పునరుద్ధరించడంతో ఆదివారం సాయంత్రం సాధారణ రాకపోకలు ప్రారంభమయ్యాయి. తుఫాన్ సమయంలో రహదారి పలు చోట్ల నీరు నిలవడం, చెరువులు ,వాగు,వంకలు పొంగిపోవడం, కల్వర్టులు దెబ్బతినడం వలన వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయిన సంగతి అందరికి తెలిసిందే. దీంతో హైదరాబాద్ శ్రీశైలం రహదారి మళ్లించి వాహనల రాకపోకలు సిఎం స్వగ్రామైన కొండారెడ్డిపల్లి మీదుగా దారి మళ్లించారు. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. జాతీయ రహదారి పనులను జాతీయ రహదారి అధికారులు అత్యవసరంగా మరమ్మత్తు ప్రారంభించారు.తఫాన్ తాకిడి తగ్గిన వెంటనే మట్టిని తొలగించి, దెబ్బతిన్న రహదారిలో పకడ్బందీగా పనులు పూర్తి చేశారు. టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, పోలీసు ఉన్నతాధికారులు జాతీయ రహదారి అధికారులు ఎస్ఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ ఎండి పవన్ రెడ్డి, జనరల్ మేనేజర్ రవికుమార్ రెడ్డి, కంపెనీ ప్రతినిధులు స్థలాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించి పనులు పూర్తి చేసి సఫలీకృతులయ్యారు. ఆదివారం సాయంత్రం రహదారి పూర్తిగా పునరుద్ధరించడం తోపాటు వాహన రాకపోకలు మామూలు స్థాయికి వచ్చాయి. స్థానికులు ఈ మేరకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రహదారి త్వరగా మరమ్మత్తు చేయించి రవాణా సౌకర్యం కల్పించినందుకు ప్రభుత్వానికి, మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేసిన అధికారులకు, ఎస్ఎస్ ఆర్ కన్స్ట్రక్షన్ ప్రతినిధులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రస్తుతం దెబ్బతిన్న ప్రాంతం తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టడం జరిగిందని భవిష్యత్తులో శాశ్వతంగా ఉండే విధంగా నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



జాతీయ రహదారి శ్రీశైలం, హైదరాబాద్ రహదారిపై ప్రారంభమైన రాకపోకలు

## రాజ్యాధికారానికై బీసీ యువకులు చైతన్యం కావాలి

**బీసీ సంక్షేమ సంఘం పాన్‌గల్ మండల యువజన కమిటీ నియామకం**

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం**

**వనపర్తి జిల్లా ప్రధానకార్యదర్శి ముకుంద నాయుడు**



మండల కమిటీ నాయకులకు నియామకం అందజేస్తున్న దృశ్యం

**వనపర్తి, నవంబరు 2 ప్రభాతవార్త:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం వనపర్తి జిల్లా ప్రధానకార్యదర్శి ముకుంద నాయుడు ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కార్యాలయంలో బీసీ సంఘం సమావేశం నిర్వహించి పాన్‌గల్ మండల కమిటీ సభ్యుల నియామకం చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం పాన్‌గల్ మండల యువజన అధ్యక్షులుగా కె.సురేష్, మండల యువజన ఉపాధ్యక్షుడుగా బి. రాముడును నియమించినట్టు జిల్లా ప్రధానకార్యదర్శి ముకుంద నాయుడు తెలిపారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు మండల పరిధిలోని బీసీల సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేయాలని, అలాగే ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో జరిగే భవిష్యత్ కార్యాచరణలో పాల్గొని బిసిల రిజర్వేషన్ల ప్రక్రియలో కీలకంగా పనిచేస్తూ బీసీ ప్రజానీకాన్ని చైతన్యం చెయ్యాలని కోరారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనీ ఆ విధంగా ఆర్.కృష్ణయ్య ఎల్లపుడూ పనిచేస్తూ వుంటారని అందరం కలిసి బీసీలను అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి ముకుంద నాయుడు, బీసీ సంఘం ఉపాధ్యక్షులు చిట్యాల రాములు బీసీ నాయకులు మోహన్ యాదవ్, సురేష్ గౌడ్, వెంకటేష్, ముదిరాజ్ రాము, పవన్, విజయ్ కుమార్, భరత్, పార్థు, చింటు, శివ, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

## మాదాసి కుర్వకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వొద్దు

**ఊట్కూర్, నవంబరు 2 ప్రభాతవార్త :** ఊట్కూర్ అంబేద్కర్ కళాభ వన్ సమీపంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు కొక్కు శంకర్, ప్రధాన కార్యదర్శి కొండన్ భరత్ మాట్లాడుతూ మాదాసి కుర్వ వారికి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయకూడదని ప్రభుత్వాన్ని డి మాండ్ చేశారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలో కొంతమంది మాదాసి కుర్వ వ్యక్తులు అక్రమంగా ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి మహ బూబ్‌నగర్ జిల్లాలో మాదాసి కుర్వ ఎవరూ ఎస్సీ వర్గానికి చెందిన వారు కారని, వారు బీసీ వర్గానికి చెందినవారని గుర్తించాలని ప్రభు త్వాన్ని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ తప్పుడు ధృవీకరణ పత్రాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు పొందిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త నారాయణ, మాజీ అంబేద్కర్ సంఘ అధ్యక్షులు ఆర్.దశరథ్, ఉపాధ్యక్షులు భక్తి తిమ్మప్ప, కోశాధికారి లావరీ బలరాం, కమిటీ సభ్యులు మహదేవ్ నాయుడు, అంబ్రిష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షులు

## జిల్లా 69వ ఎస్‌జిఎఫ్ కరాటే సెలక్షన్స్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,నవంబర్ 2 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జిల్లా 69వ ఎస్‌జిఎఫ్ కరాటే సెలక్షన్స్ నిర్వహించారు. కరాటే సెలక్షన్స్‌కు ఎజిఎఫ్సి కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఎంతోమంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారు, గత సంవత్సరం అత్యధికంగా కరాటి పోటీల్లో ఉమ్మడి జిల్లాలో పథకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారనీ ఈ సందర్భంగా క్రీడాకారులకు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని రాష్ట్రస్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబరిచే జాతీయ స్థాయికి ఎంపికై నాగర్‌కర్నూల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులను సూచించారు. అనంతరం ఈ సెలక్షన్లో విజేతలకు నాగేశ్వరరావు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎం.పాండు, ఎన్.వెంకటయ్య, పిడిలు సామ రమేష్, కృష్ణ, నరసింహారెడ్డి, స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాజిద్ అలీ, ఉపాధ్యక్షులు ధర్వేష్, రాజు, కోశాధికారి మహేష్, జాయింట్ సెక్రటరీ వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖలీల్, ముకేష్, శివ, మహేష్, శివ, రామన్ గౌడ్, నరేష్, మహేశ్, 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారని నాగర్ కర్నూల్ జిల్లా కరాటే సెలక్షన్స్ కార్య నిర్వహణ కార్యదర్శి వాజిద్ అలీ తెలిపారు.




ప్రశంసపత్రాలు అందజేస్తున్న ఎజిఎఫ్సి కార్యదర్శి నాగేశ్వరరావు

## బీసీ రిజర్వేషన్ కేంద్రం 9వ షెడ్యూల్లో చేర్చాలి


**బిజినేపల్లి, నవంబరు 2 ప్రభాతవార్త:** విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలలో 42 బీసీ రిజర్వేషన్లు తక్షణమే కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అమికే భగవంతు గౌడు అన్నారు. ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ గత 78 సంవత్సరాల స్వతంత్ర భారత ప్రయాణంలో, దేశ జనాభాలో మెజారిటీ అయిన బీసీలు ప్రతి రంగంలోను అణచి వేయబడ్డారన్నారు. రాజకీయ, ఆర్థిక, విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఎక్కడ కూడా వారికి జనాభా నిష్పత్తికి సరిపడ ప్రాతినిధ్యం లేదని, రాజకీయంగా చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో చట్ట సభలలో వారి ఉనికి నామమాత్రమే అన్నారు. ఉద్యోగాలు, విద్యా రంగాల్లో కూడా రిజర్వేషన్లు పూర్తిగా అమలు కావటం లేదని, రాష్ట్రంలో 130 కులాల బీసీ సమూహం, 2.40 కోట్లతో, 60 జనాభా ఉండగా వారు పొందుతున్న రిజర్వేషన్లు కేవలం 29 మాత్రమే అన్నారు. కేంద్రంలో రిజర్వేషన్లు 1993 నుంచి అమలు కాగా రాష్ట్రంలో 1972 నుంచి అమలు కావడంతో లక్షలాది బీసీ యువత ఉద్యోగాలు, విద్యా అవకాశాలు కోల్పోయారవి ఆర్థికంగా, వ్యాపార రంగంలో కూడా బీసీల ఉనికి లేనట్లుగానే ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో, బీసీ సమాజం మా వాటా మాకు కావాలి మా అధికారం మాకు కావాలి" అనే నినాదంతో మేల్కొని తమ న్యాయబద్ధమైన హక్కుల కోసం యుద్ధం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడినవి "హిస్సా, ఇజ్జత్, హుకుమత్"ల కొరకు పోరాడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. సామాజిక తెలంగాణ మా ధ్యేయం అని ఉద్యమించాల్సిన పరిస్థితులు ఏర్పడినవి అని సామాజిక న్యాయం ఒక ప్రహసనముగా మారింది అన్నారు. అత్యంత వెనుకబడిన బీసీ కులాలకు స్థానిక సంస్థల్లో ఉప వర్గీకరణ చేసి రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వలన బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది కావున వాటిని రద్దు చేయాలి లేదా బిసి,ఎస్సీ, ఎస్టీల లోని నిరుపేద వర్గాలకు ఇందులో అవకాశం కల్పించాలన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలి కోరారు. బీసీలకు ఎస్సీ, ఎస్టీల వలె రక్షణ చట్టాలు కల్పించాలని, జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు 56% రిజర్వేషన్లు అమలు చేయాలి. మేమెంతో మాకు అంత వాట అమలుపరచాలన్నారు. నామినేటెడ్, కార్పొరేషన్ పదవులలో సామాజిక న్యాయం పాటించి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం నియమించాలన్నారు. ఈ సమావేశంలో సుంకరి రామన్ గౌడ్, నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు

## కనుల పండుగగా తులసి కళ్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతాలు

**పెబ్బేరు, నవంబరు 2 ప్రభాతవార్త :** కార్తీక మాసం ద్వాదశి స్థితి సందర్భంగా పెబ్బేరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన తులసి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. పట్టణానికి చెందిన ఆర్యవైశ్య దంపతులు భీమిశెట్టి శ్రీనివాసులు, నిర్మల ఆధ్వర్యంలో కళ్యాణం నిర్వహించగా ఆలయ అర్చకులు కిట్టు స్వామి ఉదయం మహాశివుడికి రుద్రాభిషేకం జరిపించారు. ఆలయ ఆవరణలో ఉన్న ఉసిరి చెట్టు కింద ఉసిరి చెట్టుకు, తులసి చెట్టుకు కళ్యాణం జరిపించారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించి తీర్థ, ప్రసాదాలు వితరణ చేసి చేశారు.అన్న ప్రసాద వితరణ కూడా చేశారు. ఆర్యవైశ్యులు ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించి అక్కడే భోజనాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డి.మహేష్, యూత్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, సభ్యులు శ్రీధర్, నవీన్, నాగరాజు, చిన్న రాజు, వినోద్, సందీప్,యాదగిరి శెట్టి, శ్రీకాంత్, శ్రీనివాసులు, పద్మజ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



తులసి కళ్యాణం చేస్తున్న దృశ్యం

## అనాథాశ్రమంలో జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

**మద్దూరు, నవంబరు 2 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా పట్టణంలోని రెడ్‌క్రాస్ చిన్నారుల సంరక్షణ కేంద్రంలో మద్దూరు మండలానికి చెందిన గుంతల రమేష్ గౌడ్ తన కుమారుడు అవియుక్త్ గౌడ్ మొదటి పుట్టినరోజు సందర్భంగా 80 మంది అనాథ పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ అనాథ చిన్నారుల మధ్య తన కొడుకు పుట్టినరోజు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**దామరగిద్ద, నవంబరు 2 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం శివారెడ్డి నేడు దామరగిద్ద మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తారు. రైతులు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.బాల్‌రెడ్డి కోరారు.

## తులసి, ఉసిరి చెట్లకు కళ్యాణం



ఆరేపల్లి గ్రామంలో తులసి ఉసిరి చెట్లకు కళ్యాణ నిర్వహిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ నవంబర్ 2, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని ఆరేపల్లి గ్రామంలో ఆదివారం రోజు గ్రామ పెద్దలు మరియు ప్రవక్త ముక్కుల సమక్షంలో తులసి మరియు ఉసిరి చెట్లకు కళ్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో తులసి ఉసిరి చెట్లకు భక్తజన బృందం చేత ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దామోదర కళ్యాణంగా పిలువబడే కళ్యాణాన్ని వేద పండితుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎకరానికి రూ.50వేల పంట నష్టపరిహారాన్ని చెల్లించాలి



నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

**బిజినేపల్లి,నవంబరు 2 ప్రభాతవార్త:** అధిక వర్షాలతో పంట నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ. 50 వేల పంట నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లాకమిటీ సభ్యులు అశోక్ డిమాం డ్ చేశారు.ఆదివారం బోయపూర్ గ్రామంలో అధిక వర్షంతో నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఇప్పటికే ఎకరానికి 30 నుండి 40 వేల రూపాయల ఖర్చు పంట కోసం పెట్టాడని అధిక వర్షాలతో పూర్తిగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు పూర్తిగా పంట చేతికి వచ్చే సమయంలో ఇలాంటి అతివృష్టి వల్ల అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రభుత్వ వ్యవసాయ అధికారులు గ్రామాలలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి హనుమంతు నాయకులు రమేష్ వెంకటయ్య రైతులు పాల్గొన్నారు.

## ఉదారతను చాటుకున్న నూర్ భాషా



నూర్ బాషాను సన్మానిస్తున్న దృశ్యం

**కృష్ణ, నవంబరు 2 ప్రభాతవార్త :** తంగిడి గ్రామానికి చెందిన నూర్ భాషా విద్యుత్ దీపాలను అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో దీర్ఘకాలం నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న చీకటి సమస్యను పరిష్కరించే ఉద్దేశంతో ఆయన ద్వారా హైమాస్ట్ లైట్లు, వీధిలైట్లను అందజేస్తూ చీకటి సమస్యలున్న ఆయా గ్రామాలలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఆయా స్థానిక నాయకులకు అందజేశారు. రాత్రి సమయంలో రహదారులు, ప్రధాన కూడళ్ళు, చీకటితో ప్రయాణి కులకు ఇబ్బందికరంగా మారిందన్న విషయాన్ని గ్రహించి నూర్ భాషా తన దాతృత్వ గుణాన్ని చాటుకున్నందుకు గాను చేగుంట మాజీ సర్పంచ్ వై.శివప్ప ఆయనను అభినందించి సత్కరించారు. దాతృత్వ గుణాన్ని చాటుకుంటున్న నూర్ భాష తంగడిగి గ్రామానికి చెందిన వ్యక్తి మండలానికి పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్ర శక్తి నగర్ పట్టణంలో తన సొంత 5 స్టార్ ఎలక్ట్రికల్ మెకానిక్ షాపును పెట్టి చిన్న వ్యాపారాన్ని నడిపిస్తున్నాడు. వివిధ గ్రామాలకు తన వంతు సహాయ సహకారాలు అందించాలని లక్ష్యంతో ఆయా గ్రామాలకు ఉచితంగా వీధి దీపాలను, హైమాస్ట్ లైట్లను అందజేశాడు. ఈ సందర్భంగా చేగుంట మాజీ సర్పంచ్ వై.శివప్ప మాట్లాడుతూ ఇటువంటి దాతృత్వం కలిగిన వ్యక్తి మన మండలంలో ఉండటం మన అదృష్టమని ఇలాంటి వ్యక్తుల వల్ల సమాజానికి ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. ఇటువంటి దాతృత్వ మనసు కలిగిన వ్యక్తులు సమాజంలో కొందరే ఉంటారని అందులో నూర్ భాష ఒక్కరని అన్నారు. ప్రతి ఒక్కరూ నూర్ భాషాను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన అన్నారు. చేగుంట గ్రామానికి వీధి దీపాలను అందజేసిన ఆయనను స్థానికులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పనిచేస్తాం

**డబుల్ బెడ్ రూమ్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బోలామోని రాములు**

**వనపర్తి రూరల్, నవంబరు 2 ప్రభాతవార్త:** డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఏ సమస్య వచ్చినా అందరూ ఉమ్మడిగా ఉంటూ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డబుల్ బెడ్ రూమ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బోలామోని రాములు అన్నారు. ఆదివారం డబుల్ బెడ్ రూమ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కమిటీగా ఏర్పడి చర్చలు జరిపారు. అనంతరం వారు సమన్వయంతో ఉంటూ ఎవరి ద్వారా అయితే సమస్యలు పరిష్కారం అవుతాయో వారి పక్షాన ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. వీధిలైట్లు లేక, చెత్తాచెదారం నిండిపోయి డబుల్ బెడ్ రూమ్ ప్రాంతమంతా దోమల బెడదతో ఇబ్బందులు పడుతూ పలు అంశాలను ప్రస్తావించారు. ఇప్పటికే ఆయా వార్డు కౌన్సిలర్లు స్పందించి సమస్యకు పరిష్కారం మార్గం చూపుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి ని కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం ఇస్తున్నట్లు వారు పేర్కొన్నారు. అనంతరం నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులు డి.మాధవరావు, అధ్యక్షులు బోలెమోని రాములు, ఉపాధ్యక్షులుగా షకీల్, పికిలి రమేష్ ప్రధాన కార్యదర్శిగా, అయ్యప్ప కార్యదర్శి, టీ.రాము కార్య వర్గ సభ్యులు, వవీద్ ,గొల్ల రాజేష్,సలహ దారులు, నరేందర్, రాంచంద్రయ్య యాదవ్, గౌస్, బాలరాజులను కాలనీ ప్రజల సమక్షంలో ఎన్నుకున్నారు.

## జూబ్లీ ప్రచారంలో భూత్పూర్ బీఆర్ఎస్ నేతలు



జూబ్లీ ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మనెమోని సత్యనారాయణ,సత్తూర్ నారాయణగౌడ్

**భూత్పూర్,నవంబర్ 2,ప్రభాతవార్త :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే స్వర్గీయ మాగంటి గోపీనాథ్ మృతితో ఏర్పడిన జూబ్లీ ఉప ఎన్నిక ఈ నెలలో జరుగనున్న నేపథ్యంలో వివిధ పార్టీల ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది.నియోజకవర్గంలోని రహమత్ నగర్ డివిజన్‌కు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి ప్రచార బాధ్యతలు అప్పగించగా,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున గోపీనాథ్ సతీమణికి బీఆర్ఎస్ అధికేత కేసీఆర్ టికెట్టును కేటాయించగా ఈ తరఫున బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగిస్తోంది. మాజీ ఎమ్మెల్యే ఆలతో పాటు భూత్పూర్ బీఆర్ఎస్ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.పార్టీ మండల అధ్యక్షుడు,మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ ఇతర నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,టి మురళీధర్‌గౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,మనెమోని సత్యనారాయణ,మేకల సత్యనారాయణ,మొహ్మద్ సాధిక్,వడ్ల బ్రహ్మయ్య, రాము రాథోడ్ ఇతర నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.

## పాలమూరులో పథ సంచలన్

**మహబూబ్‌నగర్ నవంబరు 2 ప్రభాతవార్త:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పాలమూరు పట్టణంలో శనివారం ఘనంగా పథ సంచలన్ నిర్వహించారు. పట్టణంలోని ఎనిమిది ప్రాంతాల నుండి ప్రారంభమైన పథ సంచలన్, వివిధ బస్తీల గుండా సాగి ఐదు కేంద్ర స్థలాల్లో జరిగిన కార్యక్రమాలతో విజయవంతంగా ముగిసింది. ఈ పథ సంచలన్ నగరంలోని వివిధ బస్తీల గుండా సుసంఘటితంగా కొనసాగి, ఐదు ప్రధాన స్థలాల్లో జరిగిన సభలతో ముగిసింది. సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పాలమూరులోని స్వయం సేవకులు ఉత్సాహంగా పాల్గొని, దేశ సేవా సిద్ధాంతాల పట్ల తమ నిబద్ధతను వ్యక్తం చేశారు.

## రూ.రెండు కోట్లతో మయూరి సుందరీకరణ

(మొదటి పేజీ తరువాయి)



మొక్కను నాటుతున్న ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డా.సి.సువర్ణ

అటవీ సిబ్బంది ఆమె మాట్లాడారు. తర్వాత పిల్లల మర్రి వృక్షాన్ని సందర్శించారు. పిల్లల మర్రి ప్రాముఖ్యత గురించి అటవీ అధికారులు వివరించారు. అనంతరం డీర్ పార్క్, మినీ జూ పార్క్‌ను ఆమె సందర్శించి అక్కడ వివిధ పక్షులు, జంతువుల గురించి ఆసక్తిగా తిలకించారు. చివరగా శ్రీ రాజ రాజేశ్వరి ఆలయం, మ్యూజియం ను సందర్శించారు. మ్యూజియంలో సేకరించిన పురాతన విగ్రహాలు, నాణేలు, వస్తువులు, సామాగ్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కన్జర్వేటర్ ఆప్ ఫారెస్ట్, జోగులాంబ సర్కిల్ శివాల రాం బాబు,జిల్లా అటవీ అధికారి ఎస్. సత్యనారాయణ, ఎఫ్ఆర్ఓ ఎం.డి.అబ్దుల్ హై తదితరులు ఉన్నారు.

## ఇటుకల కట్టడం కాదు..
# పేదల ఆత్మగౌరవం ఇల్లు

**డబల్ బెడ్ రూమ్ పేరుతో ఓట్లు దండుకున్నారు**

**సొంతింటి కల సాకారం చేసింది కాంగ్రెస్సే**

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 2 ప్రభాతవార్త :** పేదల సొంతింటి కల నెరవేరడం అనందకరమని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఖచ్చితంగా అమలు చేస్తోందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి అన్నారు. హన్వాడ మండలం పెద్ద దర్పల్లి గ్రామానికి చెందిన ఉప్పరి మల్లమ్మ కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆమెకు నూతన గృహప్రవేశ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు అనేది ఇటుకల కట్టడం కాదు, ఒక కుటుంబానికి భద్రమైన భవిష్యత్తు, గౌరవప్రదమైన జీవితం. పేదల కలలను సాకారం చేయడం మా ప్రభుత్వ ధ్యేయం అని ఆయన చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ హామీని అమలు చేయలేదని, డబుల్ బెడ్‌రూమ్ అంటూ ఓట్లు దండుకున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి సంవత్సరం నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, అర్హులందరికీ ఇళ్లు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల నమ్మకానికి తగిన విధంగా పనిచేస్తూ, గ్రామాల అభ్యున్నతి, పేదల సంక్షేమానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి వేముల కృష్ణయ్య, డీసీసీ కార్యదర్శి టంకర కృష్ణయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వి. మహేందర్, దేవేందర్, విజయ్ నాయక్, చెన్నయ్య, రామస్వామి గౌడ్, శ్రీరామ్ గౌడ్, పల్లెమోని రమేష్, చిన్న యాదయ్య గౌడ్, మారుతి, భీమేష్, రాజు గౌడ్, నర్సింలు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపిలో భారీ చేరికలు...

### బిఆర్ఎస్ పార్టీని వీడి బిజెపిలో చేరిన వందమంది కార్యకర్తలు



కండువా కప్పి బిజెపి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు

**వనపర్తి, నవంబరు 2 ప్రభాతవార్త:** ఏదుల మండలంలో బిఆర్ఎస్ నాయకులు వెంకటపతి రాజు ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు 100 మంది బిజెపిలో చేరినట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్ర రావు సమక్షంలో బిజెపి పార్టీలో చేరినట్లు డి.నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు మాట్లాడుతూ పదేళ్ల ఆర్ఎస్ పాలన రెండేళ్ల కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో అభివృద్ధికి ఆకర్షితులై బిజెపిలో చేరడం జరుగుతుందని నూతనంగా పార్టీలో చేరిన కార్యకర్తలందరూ రాబోయే స్థానిక ఎన్నికల్లో బిజెపి పార్టీ జెండా ఎగిరే వేసే విధంగా కష్టపడాలని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ఎంపీ పోతుగంటి రాములు మాట్లాడుతూ. పార్లమెంటు సభ్యులుగా ఉన్న సమయంలో నాగర్ కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లాలలో కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేయాలని పార్లమెంటు సభలో ప్రత్యేకంగా అనేకమార్లు విజ్ఞప్తి,కృషిఫలితంగానే ఫలితంగానే వనపర్తికి కేంద్రీయ విద్యాలయం రావడం జరిగిందని అదేవిధంగా గద్వాల డోర్నకల్ రైల్వే లైన్ సర్వే 8 కోట్లతో సర్వే పూర్తి కావడం జరిగిం దని రాబోయే బడ్జెట్లో వనపర్తి జిల్లా ప్రజల చిరకాల వాంఛ రైల్వే లైన్ కళ నెరవేరబోతుందని హామీ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ నాయకత్వంలో జల్ కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల నుంచి జోరుగా బిజెపిలోకి వలసలు కొనసాగుతున్నాయని రాబోయే స్థానిక ఎన్నికల్లో అదేవిధంగా శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో భారతీయ జనతా పార్టీ గెలిచే మొదటి స్థానం వనపర్తి ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు నాయకత్వంలో ఈ మధ్యకాలంలో ఏదుల మండలంలో వందమంది కార్యకర్తలు రేవల్లి మండలంలో వందలాదిమంది ఈరోజు ఏదుల మండలంలో వెంకటపతి రాజు నాయకత్వంలో వందలాదిమంది చేరారని రాబోయే రోజుల్లో అనేకమంది బిజెపిలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర అధ్యక్షులు ఆశీస్సులతో వనపర్తి గడ్డపై బీజేపీ జెండా ఎగరవేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకట్ రెడ్డి, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోకనాథ్ రెడ్డి, స్థానిక సంస్థల జిల్లా కన్వీనర్ మంటేపల్లి పురుషోత్తం రెడ్డి, కేతూరి బుడ్డన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి మనివర్ధన్ సాగర్, ఏదుల రేవల్లి మండల అధ్యక్షులు రాము యాదవ్, బాలునాయక్, కొమ్ము శీను, పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో జ్ఞానేశ్వర్ రావు జాజిమొగ్గ పర్వతాలు బంకల శృతి, కుమ్మరి భాస్కర్, నర్సింగ్ రావు, చంద్రశేఖర్ శెట్టి, నర్సింహారెడ్డి, శివకుమార్, పాత రవిపెద్దూరు, కృష్ణ, రమేష్చ, వెంకట్ రెడ్డి, రామకృష్ణ, రమేష్ యాదవ్, సూరి, రవి నాయక్, ఖాజా భాయ్, చంద్రశేఖర్, అలీ, కరుణాకర్, నిఖిల్, వరుణ్, భానుతేజ, సాయి తేజ, భాను, సందీప్ తదితరులు ఉన్నారు.



బిఆర్ఎస్ పార్టీ నుండి బిజెపిలో చేరిన ఎదుల రేవల్లి మండల నాయకులు

# జర్నలిస్టుల సంక్షేమానికి ఐజేయూ నిరంతర కృషి

**అతి త్వరలో అక్రెడిటేషన్ కమిటీ సమావేశాలు**

**నెలాఖరులోగా మహబూబ్‌నగర్ జిల్లా మహాసభ**

**టీయూడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్**




టీయూడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ నవంబరు 2 ప్రభాతవార్త :** గత ఆరు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుల పక్షాన నిలబడి, వారి సంక్షేమానికి నిరంతరంగా పాటుపడుతున్న ఏకైక యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయు) అని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ ప్రెస్ క్లబ్లో యూనియన్ జిల్లా నాయకులతో జిల్లా మహాసభ ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన అక్రెడిటిషన్లకు సంబంధించి అతి త్వరలోనే రాష్ట్రస్థాయిలో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో జర్నలిస్టులకు ఒక అద్భుతమైన హెల్త్ పాలసీని తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోనూ యూనియన్‌లో పెద్ద ఎత్తున చేరికలు ఉన్నాయని, ఈ నెలాఖరులోపే జిల్లా మహాసభను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శిని యూనియన్ జిల్లా నాయకులు శాలువా కప్పి సన్మానించారు. అంతకుముందు మహబూబ్‌నగర్ జిల్లాకు విచ్చేసిన యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యుడు మాజీద్‌ను రాష్ట్రకార్యదర్శి మధుగౌడ్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు సన్మానించారు.కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ గౌడ్, సతీష్ రెడ్డి,శ్రీనివాస్‌గౌడ్,కాటంనాగరాజుగౌడ్,గోకులంవెంకటేష్, విజయ్, నగేష్, హుస్సేన్, మిరాజ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే మర్రి

**- ఎంజేఆర్ ట్రస్ట్ ద్వారా 200 గిరిజన కుటుంబాలకు బియ్యం,నిత్యావసర సరుకులు పంపిణీ**

**- వరదలో సర్వం కోల్పోయిన తండా వాసులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి**

**- అచ్చంపేట బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కర్త మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి**



తండా వాసులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 2 ప్రభాతవార్త:** అచ్చంపేట మండలంలోని మర్లపాడు తండా గ్రామ పంచాయతీ మొంథా తుఫాన్ సందర్భంగా కురిసిన భారీ వర్షంతో పక్కనే ఉన్న నక్కలగండి రిజర్వాయిర్‌లో ఒక్కసారిగా వరద నీరు చేరడంతో మర్లపాడు తండా మొత్తం మునిగిపోన మర్లపాడు తండాను అచ్చంపేట బీఆర్ఎస్ పార్టీ సమన్వయ కర్త నాగర్‌కర్నూల్ మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ముంపుకు గురైన తండాలో తిరిగి వరదలో కూరుకపోయిన ఇళ్లను పరిశీలించారు. రైతులు ఇళ్లలో పెట్టుకున్న పత్తిని ముంపుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తండా వాసులను నేరుగా కలిసి వారికి ధైర్యం చెప్పారు. రైతుల ఆకలి తీర్చడానికి తన ఎంజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తండాలో ఉన్న 200 కుటుంబాలకు బియ్యం,నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలు పంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విపత్తు సమయంలో మనం అందరం కలిసి నిలబడి సహాయం చేయాన్నారు. వరదలో మొత్తం తండా ముంపుకు గురైన ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ప్రతి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పోకల మనోహర్, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి లక్ష్యం: ఎమ్మెల్యే యెన్నం

**సిసి రోడ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



సిసి రోడ్ల, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 2 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ నియోజకవర్గం హన్వాడ మండలంలోని గుడి మల్లాపూర్ గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల కింద రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నామని, ప్రతి గ్రామంలోని ప్రతి వీధికి రహదారులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తూ శుభ్రత, ఆరోగ్యకర వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి–సామాజిక న్యాయం లక్ష్యంగా ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను పారదర్శకంగా వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక ప్రజలు గ్రామ అభివృద్ధి దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్‌పి వెంకటేష్, బుద్దారం సుధాకర్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి వేముల కృష్ణయ్య, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, నాయకులు టంకర కృష్ణయ్య యాదవ్, నవనీత , యాదయ్య, వెంకట్ రెడ్డి, బాలగౌడ్, ఆంజనేయులు, అంజయ్య, యాదిరెడ్డి, శివ, విజయ్ నాయక్ పాల్గొన్నారు. ధ్యానం ప్రయోజనం ప్రతి ఒక్కరికి చేరాలి. ధ్యానం ద్వారా కలిగే ఆధ్యాత్మిక, మానసిక ప్రయోజనాలు ప్రతి ఇంటికీ చేరాలి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. హన్వాడ మండలం దాచక్ పల్లి గ్రామంలోని మహేశా పిరమిడ్ ధ్యాన కేంద్రం 13వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నో గ్రామాల్లో ధ్యానం ప్రాచుర్యం ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదని, అందువల్ల ధ్యానం ప్రయోజనాలను ప్రజల్లో మరింతగా విస్తరించాలని అన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల అనుమతితో ధ్యాన కార్యక్రమాలు నిర్వహించండి, ఇది కేవలం రూపకల్పన కాకుండా నిజమైన భక్తి, ఆత్మీయత, సేవభావంతో జరిగితేనే ఫలితాలు దక్కుతాయని సూచించారు. ధ్యానం అలవాటు చేసుకున్న పిల్లలు భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదుగుతారు. ఇది రాబోయే తరాలకు అందించగలిగే గొప్ప బహుమతి" అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎన్.పీ. వెంకటేష్, బుద్దారం సుధాకర్ రెడ్డి, వేముల కృష్ణయ్య, టంకర కృష్ణయ్య యాదవ్, హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు వి. మహేందర్ యాదిరెడ్డి, మహేశా పిరమిడ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మర్రి జోష్.. మూన్నాళ్ల ముచ్చటేనా..!

(మొదటి పేజీ తరువాయి)

అచ్చంపేట బిఆర్ఎస్‌ను పట్టించుకుంటే పార్టీ పటిష్టం గా ఉంటుంది కానీ అచ్చంపేట బిఆర్ఎస్‌పై సవతి తల్లి ప్రేమ చూపిస్తూ కాలం గడిపితే రానున్న కాలంలో అచ్చంపేటలో గులాబీ పార్టీ క్షీణిస్తుందని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**గువ్వల... మర్రి కమిట్మెంట్ అయ్యారా...**

అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తాను పనిచేస్తున్న బిజెపిపార్టీని బలోపేతం చేసుకునేందుకు అచ్చంపేట బిఆర్ఎస్ ఇంచార్జ్ మర్రిజనార్దన్ రెడ్డితో కమిట్మెంట్ అయ్యారా అన్న సందేహాలు వ్యక్తమవుతు న్నాయి. ఎందుకంటే గువ్వల రాజీనామా అనంతరం గులాబీ పార్టీ బలోపేతానికి ఎంతో జోష్‌తో అచ్చంపేట గులాబీ కార్యకర్తల్లో,నాయకుల్లో ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేసిన మర్రి జనార్దన్‌రెడ్డి నేడు అచ్చంపేటలో జరిగిన ప్రకృతి విలయతాండానికి ఎంతో నష్టపోయిన రైతులను పరామర్శించడానికి రాకపోవడం ఒక ఎత్తైతే.... కేటీఆర్ సభ అనంతరం అచ్చంపేట నియోజకవర్గంలో అడిగిపెట్టిన దాఖలాలు లేవని చెప్పుకోవచ్చు. గులాబీ పార్టీలో వారిద్దరూ ఎమ్మెల్యేలుగా కొనసాగిన సమయంలో మంచి మిత్రులుగా కొనసాగుతూ ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకొని సవ్యంగా పార్టీలో నడుచుకోవడంతో పాటు వ్యక్తిగత విషయాలను కూడా కలిసిమెలిసి వ్యవహరించిన తీరును చూస్తే నేడు గువ్వలకు మర్రి పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్నారా అనడంలో అతిశయోక్తి లేదు. నల్లమల ప్రాంతంలో గులాబీ పార్టీని విచ్ఛిన్నం చేస్తారా కాపాడుకుంటారా వేచి చూడాల్సిందే.



నితీష్‌కుమార్ వివాహ రిసెప్షన్‌లో పాల్గొన్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ ఇతర నాయకులు

## వివాహ వేడుకల్లో పాల్గొన్న పలు పార్టీల నేతలు

**భూత్పూర్,నవంబర్ 2,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ కేంద్రంలోని ఎవీఎన్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ నాల్గోవార్డుకు చెందిన కుమ్మరి మురళి తనయుడు కుమ్మరి నితీష్‌కుమార్ రిసెప్షన్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ వేడుకలకు వివిధ పార్టలకు చెందిన నాయకులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ వేడుకల్లో భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్‌తో పాటు ఇతర నాయకులు బోరింగ్ నర్సింహులు,గడ్డం ఎల్లప్ప,అర్వ శంకరయ్య,గడ్డం యాదయ్య, వినయ్ కుమార్, వంశీతో పాటు బీఆర్ఎస్ నాయకులు మెహ్మద్ సాధిక్,మొహ్మద్ షాకీర్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## పిల్లల ప్రాణాలతో చెలగాటం..

**పిల్లలతో పనులు చేస్తున్న కేరళ పాఠశాల యాజమాన్యం**



విద్యార్థులతో పనులు చేయిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, నవంబరు 2 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలోని కేరళ హైస్కూల్ యాజమాన్యం పాఠశాలకు సంబంధించిన హాస్టల్ పిల్లలతో పాఠశాల పనులు చేయిస్తోంది. కొంతమంది చిన్నారులు పాఠశాల ప్రాంగణంలో ప్రమాదకరంగా ఉన్న రేకుల పైకి ఎక్కి చెత్తను క్లీన్ చేస్తూ కనిపించారు. ఈ పాఠశాల మొదటి నుంచి కూడా తరచూ వార్తలో నిలుస్తోంది. ఇంతకి ముందే అనేక కారణాలతో పాఠశాల మూసివేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారు. ఇప్పుడేమో పనులు చేయిస్తూ స్థానికుల ఆగ్రహానికి గురవుతున్నారు. ఇప్పటికైనా వీరిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

**అయిజ నవంబర్ 2, ప్రభాతవార్త;** నేడు జాతీయ విద్యుత్ వినియోగ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో తెలంగాణ సౌత్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ఆధ్వర్యంలో వినియోగదారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆదివారం ఏడిఈ గోవింద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా అయిజ మరియు గట్టు, మల్లకల్, రాజోలి ,మండలాల చెందిన విద్యుత్ వినియోగదారులందరూ ఈ సమావేశంలో పాల్గొని సంబంధిత విద్యుత్ సమస్యలపై సత్వర పరిష్కారం పొందగలరని కోరారు. కార్యక్రమంలో సంబంధిత విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్లు, జూనియర్ అకౌంటెంట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొంటారని ఆయన తెలియజేశారు.

## శక్తి పీఠం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం



కృష్ణవేణి, భీమా నదుల సంగమ స్థలంలో భక్తులు కార్తీక నదీ స్నానం చేస్తున్న దృశ్యం

**నారాయణ పేట, నవంబరు 2 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో సమారాధన కార్యక్రమాన్ని వ్యవస్థాపకులు డా. శాంతానంద స్వామి పురోహిత్ నిర్వహించారు. కార్తీక శుద్ధ ద్వాదశి సందర్భంగా కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా యాత్ర సంగమ్ వద్ద ఒకరోజు ఆధ్యాత్మిక యాత్రను చేపట్టారు. కృష్ణవేణి, భీమా నదుల సంగమ స్థలంలో భక్తులు కార్తీక నదీ స్నానం, శ్రీనివాస కళ్యాణం, రాధా దామోదర కల్యాణం నిర్వహించారు. ప్రదోష వేళలో నదీ హారతి ఘనంగా జరిగింది. అనంతరం సాంప్రదాయ బ్రాహ్మణ వంటలతో వనభోజనం ఏర్పాటు చేశారు. శాంతానంద స్వామి పురోహిత్ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. భక్తులు సాంప్రదాయ వేషధారణలో పాల్గొని కళ్యాణోత్సవాన్ని వైభవంగా జరిపారు.

## ప్లాస్టిక్ రహిత గ్రామాలు గా కృషి చేయండి

**–మహిళా సమాఖ్య సభ్యులకు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేష్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేష్

**కంది, నవంబరు 2, ప్రభాతవార్త:** మండల మహిళా సమైఖ్య సభ్యులు గ్రామాలను ప్లాస్టిక్‌రహిత గ్రామాలుగా చేసేందుకు తమ వంతు కృషి చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేష్ సూచించారు. మండల కేంద్రమైన కందిలో ఆదివారం మండల మహిళా సమైఖ్య ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ రమేష్, ఐకెపి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ శివలక్ష్మిలు మాట్లాడుతూ గ్రూపు సభ్యులందరూ పంచ సూత్రాలు పాటించాలన్నారు. ఆర్థిక సంవత్సరంలో 22 కోట్లకు పైగా వివిధ బ్యాంకు రుణాలను మహిళా గ్రూపులకు,వ్యాపారులకు బ్యాంకు రుణాలను అందిచడం జరిగిందన్నారు. కోటి మందిని కోటీశ్వరులు చేయడానికి మహిళా శక్తిలో భాగంగా ప్రతి గ్రామ సంఘంలో నాలుగు రకాల గ్రూపులు వికలాంగుల, వృద్దుల, కిశోర బాలిక, కొత్త మహిళా గ్రూపులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యలయ సిబ్బంది సీసీలు శశికళ, సంతోష, స్వప్న, ప్రవీణ, పల్లవి, సిఆర్‌పిఎస్‌లు రాధ, సుజాత, మంల సమైఖ్య అధ్యక్షురాలు పాల్గొన్నారు.

### కళ్యాణోత్సవానికి రావాలని మాజీ మంత్రికి ఆహ్వానం

**ఝురాసంగం, నవంబరు 2, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝురాసంగంలోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసంను పురస్కరించుకుని శ్రీకార్తీక మాస కళ్యాణోత్సవ మహోత్సవ కార్యక్రమాలకు హాజరు కావాలని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ ఆగమ చంద్రశేఖర్‌రావుకు ఆదివారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతరావు పాటిల్ ఆధ్వర్యంలో ఆలయ కమిటి బాధ్యులు ఆహ్వాన పత్రికను అందచేశారు. కార్యక్రమంలో ఝురాసంగం, న్యాల్‌కల్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్, బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, కేతకి ఆలయ కమిటి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, ఆలయ ఇఒ శివరుద్రప్ప, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



### సిర్గాపూర్‌లో బిజెపి నాయకుల అరెస్టు

**సిర్గాపూర్, నవంబరు 2, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని శివాజీ చౌక్ వద్ద హైద్రాబాద్‌లోని జూబ్లిహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బిజెపికి,ప్రధాన మంత్రికి వ్యతిరేకంగా అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులను ఆదివారం సిర్గాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి అరుణ్‌రాజ్ శేరికార్,మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పటేల్,యూత్ అధ్యక్షులు యాదగిరి,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు గైని రాజు, యువజన ప్రధాన కార్యదర్శి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

### హరీష్‌రావును పరామర్శించిన



: హరీష్‌రావును పరామర్శిస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

### మండల ముదిరాజ్ సంఘం సభ్యులు

చిన్నకోదూరు, నవంబరు2, ప్రభాతవార్త :మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తండ్రి సత్యనారాయణరావు ఇటీవల మృతి చెందగా హైదారాబాద్ కోకాపేటలోని క్రిన్స్ విల్లాస్‌లో ఆయనను మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం సత్యనారాయణరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, ముదిరాజ్ సంఘం నాయకులు జంగిటి శ్రీనివాస్, మేడికాయల వెంకటేశం, కీసర పాపయ్య, ముత్తయ్య,సందిల్ల భద్రయ్య,యాట రాజేష్, శ్రీనివాస్, మల్లేశం,రాజు, కొంగరి నారాయణ తదితరులు ఉన్నారు.

### వైభవంగా తులసి దామోదర కళ్యాణం



### కార్తీక వనభోజనాలు

**నారాయణఖేడ్, నవంబర్ 2 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ పట్టణ శివారులోని నారాయణి షాపింగ్‌మాల్ వారి ఉసిరివనంలో పద్మశాలి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తులసి దామోదర కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేసి దీపాలు వెలిగించారు. అత్యంత పరమ పవిత్రమైన కార్తీక మాసంలో దీపారాధన చేయడం వలన సర్వ శుభాలు కలుగుతాయన్నారు. అనంతరం కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి పెద్దలు, పద్మశాలి మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

### గుంతలు పూడ్చిన యువకులు....

**పాపన్నపేట, నవంబర్ 2, ప్రభాతవార్త** ః ఎవరో వస్తారని ఎదిరి చూడకుండా సమస్య పరిష్కారం కోసం తమవంతుగా కొడపాక యువకులు ముందుకొచ్చారు. అనుకున్నదే తడవుగా పనులకు శ్రీకారం చుట్టారు, రోడ్డు మరమ్మతు చేశారు.. ఇటీవల కురిసిన వర్షాలకు కొడుపాక నుంచి ఏనే వైపు వచ్చే రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. అట్టి గుంతలను పూడ్చే కార్యక్రమానికి కొడుపాక యువత శ్రీకారం చుట్టారు. ఎవరి కోసం ఎదురుచూడకుండా, యువకులు గడ్డపారలు, గంపలతో గుంతల్లో

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు**



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు

**సిద్ధిపేట అర్బన్, నవంబరు 2, ప్రభాతవార్త :** ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో మేలు చేస్తాయని..ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పట్టణ మున్సిపల్ చైర్మన్ కడవెర్గు మంజుల రాజనర్సు అన్నారు. జిల్లా కేంద్రంలోని రైస్‌మిల్లు అసోసియేషన్ భవనంలో ఆదివారం రైస్ మిల్లర్సు అసోసియేషన్, వాసవిక్లబ్స్ ఆధ్వర్యంలో అగస్త్య హాస్పిటల్స్ హైదారాబాద్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడానికి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె కోరారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, ఆర్యవైశ్యమహాసభ ప్రతినిధులు అయిత రత్నాకర్, డాక్టర్ మాంకాల నవీన్‌కుమార్, తణుక అంజనేయులు, సముద్రాల హరినాథ్ తదితరులు మాట్లాడారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో 400కు పైగా మందికి 6 రకాల వ్యాధులకు సంబంధించి వైద్యులు ఎస్.రాంకమల్, పి.ప్రవీణ్‌రెడ్డి, వై.వినోద్‌బాబు, రాహుల్, సురేష్,సురేష్‌రెడ్డి సుధాకర్‌రెరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు .కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్, ఆర్యవైశ్యమహాసభ, వాసవిక్లబ్స్ ప్రతినిధులు పుల్లూరి శివకుమార్, అర్వపల్లి హరికిరణ్, మాంకాల నాగరాణి, హేమలత, గంప కృష్ణమూర్తి, నీరుమల్ల రవీందర్, అంజయ్య, కుమార్, మంజుల, కొమురవెల్లి శేఖర్, విష్ణుమూర్తి, కాశీనాథ్, మాంకాల సంతోష్, పుల్లూరి శశాంక్, చంద్రశేఖర్, తడకమడ్ల శంకరయ్య, లింగా శ్రీనివాస్, శ్రవణ్, మహేష్ పాల్గొన్నారు.

## మొంథా తుఫాను జాతీయ విపత్తుగా ప్రకటించాలి



సదాశివపేట,మునిపల్లి,నవంబర్ 1(ప్రభాత వార్త) (ప్రభాతవార్త): మెంతా తుఫాను జాతీయ విపత్తుగా పరిగణించి సంగారెడ్డి జిల్లాలో నష్టపోయిన వరి పత్తి రైతాంగానికి ఎకరాకు 30 వేల రూపాయల చొప్పున నష్టపలను చెల్లించాలని బికేఎంయు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.గంగమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారుగత వారం రోజులుగా కూరుస్తున్న మెంతు తుఫాన్ వల్ల జిల్లాలోని అనేక మండలాల్లో పత్తి వరి పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. తడిచిన వరిని అలాగే ప్రతి పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి పత్తికి కనీస మద్దతు ధర క్వింటాల్ కు 12. వెలు చెల్లించాలి అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపోయిన నా రైతాంగానికి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు ఈ తుఫాన్ బీభత్సం వల్ల అనేక గ్రామీణ ప్రాంతంలో ఇల్లు కూలిపోయాయి తినవస్తులు ఆహార పదార్థాలు కొట్టుకుపోయాయి కూలిపోయిన ఇళ్ళను ఇందిరమ్మ పథకం కింద చేర్చి ఇళ్ల నిర్మించాలి ఇవ్వాలి. బాధిత కుటుంబాలకు ఆర పదార్థాలు వస్తువులు ప్రభుత్వం ఉచితంగా అందించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎండి సాధిక్‌అలీ. శివలిల. బుజమ్మ. సరస్వతీ. రాజమ్మ. దేవిబాయ్ తదితరులు పాల్గొన్నారు .

## తుఫాను బాధితులను రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలి

### వెంటనే నష్టపరిహారం చెల్లించాలి

**సంగారెడ్డి బ్యూరో నవంబర్ 2, ప్రభత వార్త:** మొంథా తుపాన్ రైతులను నిండా ముంచింది. వారం క్రితం రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో ఆరుగాలం శ్రమించిన పంటను నీళ్లపాలు చేసింది. వంట చేతికొచ్చే దశలో తుఫాన్ రూపంలో తన్నుకుపోయింది. కొనుగోలు కేంద్రాల్లో అరబోసుకున్న ధాన్యమంతా తడిపి ముద్దచేసింది. కొంత ధాన్యంను వరదలో కొట్టు కు పోయింది. ఇంకా కోయని వంటలన్నీ నేలరాల్చి, పత్తి పంటకు సైతం ఆపార నష్టం తెచ్చిపెట్టింది. తుఫాన్ వచ్చి ఇంత నష్టం తెచ్చిన తుఫాన్ బాధిత రైతులను భరోసా ఇచ్చేందుకు, నష్టపోయిన పంటలను అంచనా వేసేందుకు వ్యవసాయాధికారులు పత్తా లేకుండా పోయారని జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. కండ్లముందే దెబ్బతిన్న వంటలు, తడిసిన ధాన్యాన్ని చూసి రైతులు కన్నీరు పెడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు కొనుగోళ్లను వేగవంతం చేయకపోవడంతో తుఫాన్ తో తీవ్రంగా నష్టపోయమని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా నష్టపోయిన పంటలను పరిశీలించి, నష్టపరిహారం అందేలా చూడాలని రైతులు వేడుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎక్కువ శాతం రైతులు ప్రధానంగా వరి పంట పై ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తుంటారు. ఈ సీజన్ లో సంగారెడ్డి జిల్లాలో 7 లక్షల 50,వేలు ఎకరాలలో వివిధ రకాల పంటల సాగు చేయగా 1 లక్ష 56 వేల ఎకరాలలో వరి పంటను సాగు చేశారు. జిల్లాలో కొన్ని మండలాలలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రజాప్రతినిధు లు, అధికారులు ప్రారంభించినప్పటికీ ఇంక కొన్ని కేంద్రాలలో వరి కొనుగోలు మాత్రం ప్రారంభం కాలేదని ఆయా మండలాలలోని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని కొన్ని గ్రామాలలో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద దాన్యం అరబోసుకొని ఎప్పుడు కాంట వేస్తారా అని ఎదురుచూస్తున్నారు. తుపాన్ ప్రభావంతో వరి కోతలు నిలిచిపోగా కొనుగోలు కేంద్రాల వద్ద అరబోసుకున్న దాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తుపాన్ ప్రభావంతో వరి, పత్తి పంట దెబ్బతినడంతో ఈసారి కూడా దిగుబడి తగ్గి పూర్తి గా నష్ట పోయారు. కేంద్రాల్లో తడిసిన ధాన్యం అరబెట్టు కోవడం, కొట్టు కు పోయిన ధాన్యం కోసం దిగాలు చెందుతున్నారు. ఈ ఆకాల వర్షానికి నష్ట పోయిన రైతు లకు ప్రభుత్వం పరంగా వచ్చే పరిహారం అందించడం లో ముఖ్య భూమిక పోషించాల్సిన వ్యవసాయ అధికారులు కొన్ని మండలాలలో నిరక్ష ్యంల వహిస్తున్నారని ఆయా గ్రామాల రైతుల ఆరోపిస్తున్నారు. ఈ విషయమై జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో నష్టపోయిన పంటలను అంచనా వేశామని 7వేల 2 వందల ఎకరాలు పంట నష్టం జరిగిందని, ఇందులో పత్తి, వరి ఎక్కువ శాతం ఉందని అన్నారు.ప్రభుత్వానికి నివేదిక అందజేశామని ఆయన అన్నారు.

### పంట నష్టపోయిన రైతులు యాప్‌లో నమోదు చేయించుకోవాలి

హుస్నాబాద్ రూరల్,నవంబర్ 2,ప్రభాతవార్తమొంథా తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులు తమ వివరాలను వ్యవసాయ అధికారులను సంప్రదించి యాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పూజ తెలిపారు.సోమవారం (నేడు) మండల వ్యవసాయ అధికారుల బృందం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో పర్యటించనున్నారని పంటలు నష్టపోయిన రైతులందరూ గ్రామాల్లో ఉండి ఆ క్లస్టర్ ఏఈవోను సంప్రదించి వివరాలను యాప్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

### మల్లికార్జున స్వామి,పోచమ్మ దేవాలయాలనిర్మాణానికి భూమిపూజ



**గజ్వేల్, నవంబరు 2 (ప్రభాతవార్త):** శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్‌లో ఆదివారం శ్రీ మల్లికార్జునస్వామి, పోచమ్మ దేవాలయాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగదేవ్‌పూర్ మాజీ జెడ్‌పిటిసి యెంబరి రామచంద్రం, సిద్దిపేట జిల్లా యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, వనం మల్లేష్‌యాదవ్, పత్తి బాబు, స్థానిక మాజీ కౌన్సిలర్ పంబాల శివకుమార్, శీర్ల మల్లేష్‌యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు దువ్వల బిక్షపతియాదవ్, ప్రధాన కార్యదర్శి ఎక్కలదేవి కనకరాజుయాదవ్‌లు మాట్లాడుతూ శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి, పోచమ్మ దేవాలయాల నిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగిందన్నారు. త్వరలో ఆలయాల నిర్మాణం పూర్తి చేస్తామని, ఇట్టి కార్యక్రమానికి యాదవ సంఘం సభ్యులతో పాటు గ్రామస్తులు సహకరించాలన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు చీర్ల యాదగిరి, రొట్టెల శ్రీనివాస్, రొట్టెల ఐలేష్‌యాదవ్, మలమైన లింగంయాదవ్, దువ్వల శ్రీనివాస్‌యాదవ్, నాగరాజుయాదవ్, కృష్ణయాదవ్, కడారి ఐలయ్య, గట్టు రమేష్, కటికం స్వామి, మంద నరేష్‌యాదవ్, కనమైన రమేష్, రొట్టెల ఐలయ్య, కొనమైన రాజయ్య, మలమైన మల్లేష్‌యాదవ్, మంద సదానందం, దువ్వల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ మండల ఎస్సీసెల్ అధ్యక్షులుగా ప్రశాంత్



**చిన్నకోదూరు, నవంబరు 2, ప్రభాతవార్త :** చిన్నకోదూరు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా రామంచ గ్రామానికి చెందిన కొమ్ము ప్రశాంత్‌ను నియమించారు.ఈ మేరకు ఆదివారం చిన్నకోదూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్ సమక్షంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొమ్ము విజయ్‌కుమార్ చేతుల మీదుగా నియామకం పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ మండల అధ్యక్షులుగా నియమితులైన ప్రశాంత్ మాట్లాడుతూ మండలంలో ఎస్సీ సెల్ విభాగాన్ని మరింత పటిష్టం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన పదవి రావడానికి సహకరించిన ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ప్రితం, సీనియర్ నాయకులు మైనంపల్లి హన్మంతరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు మీసం మహేందర్‌యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

### జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**నారాయణఖేడ్, నవంబర్2 ప్రభాతవార్త:** హైదరాబాద్ పట్టణంలోని జీహెచ్‌ఎంసీ పరిధిలోనిజూబ్లిహిల్స్ ఉప ఎన్నికల్లో బాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా షేక్‌పేట్‌డివిజన్లో ఇంటింటి ప్రచారంలో నారాయణఖేడ్ శాసనసభ్యులుడాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని షేక్‌పేట్ ముఖ్యకాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.

## పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

**–జిల్లాఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటిసభ్యులు ఇమ్మయ్య**

**పుల్‌కల్, నవంబరు 2, ప్రభాతవార్త:** శాసన సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని జిల్లా ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు కాశపాగ ఇమ్మయ్య ఆరోపించారు. ఆదివారం తాడ్దానిపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఇమ్మయ్య మాట్లాడుతూ నిరుపేదలకు నీడ ఇచ్చేందుకు ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ముందకు సాగడం లేదని ఎద్దేవ చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివాసముంటున్న ఎస్సీ, ఎస్టీ, బిసి,మైనార్టీలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం హామి చేసిందని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజనీకాన్ని నిలువునా మోసం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందోల్ అసెంబ్లి నియోజకవర్గంలో పేదలకు మంజూరైన ఇండ్లపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఏనాడూ సమీక్షించిన పాపన పోలేదని ఆభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతగా లక్షలాది మంది లబ్దిదారులకు ఇండ్ల మంజూరి పత్రాలను జారీ చేశారని, మొదటి విడతగా కేటాయించిన ఇండ్లను ఎక్కడ సక్రమంగా నిర్మించలేదన్నారు. ఇండ్లు నిర్మించుకోని వారికి రద్దు చేసి ఇతరులకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్న వారికి ఇండ్ల నిర్మాణానికి ప్రతి లబ్దిదారుడికి ఇసుకను ఉచితంగా ఇస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం ఆచరణలో అమలు చేయడం లేదని ఎద్దేశ చేశారు. ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగుని గుణపాఠం చెప్పడం తథ్యమన్నారు.

## పోసానిపల్లిలో బిజెపి జెండా ఆవిష్కరణ




**చౌటకూరు, నవంబరు 2, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోసానిపల్లిలో ఆదివారం భారతీయ జనతా పార్టీ యువ నాయకురాలు చంటి దేవిక ప్రభు బిజెపి జండాను ఆవిష్కరించారు. ఇంటింటికి బిజెపి కార్యక్రమంలో భాగంగా పార్టీ జండాను ఆవిష్కరించామని చంటి దేవిక ప్రభు పేర్కొన్నారు. మండల కేంద్రమైన చౌటకూరు నుంచి పోసానిపల్లి వరకు రహదారి పూర్తిగా ఆధ్వాన స్థితినిక చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను బలపరిస్తే గ్రామీణ రోడ్లను బాగుచేస్తామన్నారు. 5వ ఫ్యూచర్ సిటీకి మద్దతుగా మండలం నుంచి 20వేల సంతకాలు సేకరణ చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్ష,కార్యదర్శులు నీరుడి ప్రవీణ్ ముదిరాజ్, ప్రవీణ్‌రెడ్డి,నాయకులు సార రాజ్‌కుమార్, ముకుందం ముదిరాజ్, గాండ్ల శ్రీనివాస్, గొంగ్లూరు విద్రుడు ముదిరాజ్, మాణిక్‌రెడ్డి,పల్లె ప్రభు కుమార్‌గౌడ్, దేవేందర్, సత్యనారాయణ, బుర్కల రామకృష్ణ, చందాపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా బాటలో పాల్గొన్న విద్యుత్ అధికారులు

సంగారెడ్డి టౌన్, నవంబరు 2, ప్రభాతవార్త: మండల పరిధిలోని మంజీరా డ్యాం పరిసరాల్లో ఆదివారం విద్యుత్ అధికారులు ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏడి లక్షణ్ మాట్లాడుతూ విద్యుత్ వైర్ల కింద, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద పెద్ద ఎత్తున పేరుకు పోయిన పిచ్చి మొక్కలను తొలగించామన్నారు. వారానికి మూడు రోజుల చొప్పున వీధుల్లో తిరిగాడుతూ విద్యుత్ స్థంభాల వద్ద, ట్రాన్స్ ఫార్మర్ల దగ్గర, వైర్ల కింద పెద్దగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించేందుకే ప్రజా బాట కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ పరమైన సమస్యలు ఉంటే విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1213కి కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

### గుడ్‌పల్లిలో దర్గా ఉర్సు ఉత్సవాలు

**జహీరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త:** మొగుడంపల్లి మండల పరిధిలోని గుడ్‌పల్లిలోని హజ్రత్ సయ్యద్ లతీఫ్ కారిదర్గా ఉర్సు ఉత్సవాలను సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు దుర్గా ఉర్సు ఉత్సవ కమిటి అధ్యక్షులు మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నాజీం పటేల్, దర్గా సంరక్షకులు సయ్యద్ నహీముద్దీన్‌లు తెలిపారు. మొదటి రోజైన సోమవారం అన్నదాన కార్యక్రమం, రాత్రి9 గంటలకు గుడ్‌పల్లి, ఔరంగనగర్ గ్రామాల నుంచి సందాల్ ఊరేగింపు దర్గా వరకు కొనసాగుతుందన్నారు. మంగళవారం రాత్రి కవ్వాలి పోటీలు ఉంటాయన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు దర్గా ఉర్సు ఉత్సవాలకు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

### చలో హైద్రాబాద్ గోడ పత్రిక ఆవిష్కరణ

జహీరాబాద్, నవంబరు 2, ప్రభాతవార్త: ఈ నెల 7వ తారీఖున ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హైద్రాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే విశ్రాంత ఉద్యోగుల నిరసన దీక్ష, ధర్నా కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ శాఖ సమావేశాన్ని అధ్యక్షులు గడ్డం జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డం జనార్ధన్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ సమస్యలను, డిఏ, పిఆర్సి, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగులు ధర్నా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, బస్వరాజు, రాజేందర్‌రావు, కలాస్ ప్రభాకర్, అజీమ్, కైలాస్ రాజశేఖర్, నర్సింగ్‌రావు, యాకూబ్ అలీ,మహబూబ్ గౌరి, సైఫోద్దిన్,రమేష్ బాబు, దుర్గయ్య, మల్లేశం, రాందాస్, బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ యువకుడు మృతి

**జగదేవ్‌పూర్, నవంబరు 2 (ప్రభాతవార్త)**

:పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన జగదేవ్‌పూర్ మండలం అంతాయగూడ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అంతాయగూడ గ్రామానికి చెందిన తిగుళ్ల మల్లయ్య, యాదమ్మల కుమారుడు బాలయ్య(34) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి ఎనిమిది సంవత్సరాల క్రితం దౌలాపూర్ గ్రామానికి చెందిన కళ్యాణి అనే మహిళతో వివాహం కాగా వారికి పిల్లలు పుట్టకపోవడంతో అప్పుడప్పుడు బాధపడేవాడని, గతకొద్ది రోజులుగా ఈ విషయంలో తీవ్ర మనస్థాపానికి గురైన బాలయ్య గతనెల 28వ తేదీన రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లోనే మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 10 గంటలకు మృతిచెందాడు. మృతుని భార్య కళ్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు

### ఏడుపాయల్లో భక్త సందోహం...



పాపన్నపేట, నవంబర్ 2, ప్రభాతవార్త ః పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాత సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది , ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఏడుపాయలకు చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు, గత కొన్ని రోజులుగా సింగూరు ప్రాజెక్ట్ నుండి దిగువకు నీటిని వదలడం తో ఘనపూర్ ఆనకట్ట మీదుగా పెద్ద ఎత్తున వరద నిజాంసాగర్ వైపు పరుగులు పేడుతుంది, దీంతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపాల్ లో ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు అమ్మవారిని రాజగోపురంలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ ఇవో చంద్రశేఖర్, సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, శ్యామ్, మధుసూదన్ రెడ్డి, నర్సింలు, బత్తిని రాజు, వరుణ్ చారి, యాదగిరి తదితరులు ఏర్పాటు చేయగా, వేద పండితులు శంకరశర్మ ,పార్థివ శర్మ, రాము శర్మ తదితరులు పూజలు నిర్వహించారు, ఏడుపాయలలో ఏలాంటి సంఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టారు,.

### బేడా 4 నూతన కార్యవర్గం ఎన్నిక...

రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 2, ప్రభాతవార్త ః మున్నూరు కాపు సంఘం రామయంపేట బేడా నంబర్ 4, 2025=26 సంవత్సరానికి గాను కార్యవర్గాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు దేమె యాదగిరి అధ్యక్షతన స్థానిక సీతయ్య గుడిలో సమావేశమై ఈ కింది కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బీర రామచంద్రం, ఉపాధ్యక్షులు కర్ల వెంకటేశం, కార్యదర్శి బీర కిషన్, సహాయ కార్యదర్శి లాల నాగరాజు, కోశాధికారి బీర రాము, ఆడిటర్లు బీర బిక్షపతి, బీర బాలచంద్రం, సలహాదారులు బీర స్వామి,బీర ఆంజనేయులు, కస్తూరి శేకర్, అల్లాడి శ్రామాజ్, గాజుల రాజు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.